క్లుప్తంగా

19న ఉచిత ఆర్థో మెడికల్ క్యాంప్

కాచిగూడ: బర్కత్‌పురాలోని సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ క్లినిక్‌లో ఈనెల 19న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత ఆర్థో మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు క్లినిక్ మేనేజర్ శ్యామ్ ప్రకటించారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కుషాల్ హిప్పల్‌గాంకర్ పాల్గొని రోగులకు ఉచిత వైద్యసేవలు అందిస్తారన్నారు. ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన కోరారు.

22న మున్నూరుకాపు సర్వసభ్య సమావేశం

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ సర్వసభ్య సమావేశం ఈనెల 22న కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర రావు అధ్యక్షతన జరుగుతుందని మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ప్రకటించారు. ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సుతారి నర్సింహులుచే పంచాంగ శ్రవణం ఉంటుందని ఈనెల 30 న సీతారామ కల్యాణ మహోత్సవ వేడుకలను నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు.

మంత్రి గంగులకు ఆహ్వానం



ముషీరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీల వాటా పెంచాలని బీసీలను కేంద్రం చిన్న చూపు చూడడం తగదని బీసీ సంక్షేమ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. త్వరలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగే అఖిల పక్ష సమావేశానికి హాజరు కావాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి బీసీ నాయకులు ఆహ్వానం అందజేశారు. జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు భూపేష్ సాగర్, నందగోపాల్, జనార్దన్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి దేవాలయం హుండీ లెక్కింపు



చిక్కడపల్లి: నగరంలో ప్రసిద్ధి చెందిన చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో దేవాదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో చైర్మన్ మురళీప్రసాద్, ఈఓ దేవనాథం సమక్షంలో శుక్రవారం హుండీని లెక్కించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 51 రోజులకు రూ.1,83,180 ఆదాయం వచ్చిందన్నారు. దేవాలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ జీ.కే.రమణ, మురికిగణేష్, పద్మాబాసాని, అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, కందాల వెంకటాద్రి, పురుషోత్తమాచారి, కృష్ణమూర్తి, ఎస్‌బీవీఎస్ ఆచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు

అంబర్‌పేట: అంతర్గత రోడ్ల సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం డివిజన్‌లో ఆకాశ్ నగర్, నరేంద్రనగర్, పటేల్‌నగర్ తదితర ప్రాంతాల్లో ప్రజా సమస్యలపై కార్పొరేటర్ క్షేత్రస్థాయి అధికారులతో కలిసి పర్యటించారు. డివిజన్‌లో అంతర్గత రోడ్ల పరిస్థితిపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు తక్షణ పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. డ్రైనేజీ, కలుషిత తాగునీరు వంటి సమస్యలను పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటానన్నారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రతిపాదనలు రూపొందించి అభివృద్ధి పనులు చేపడుతామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. జలమండలి ఇన్‌స్పెక్టర్ రమేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, ఎస్‌ఎఫ్‌ఏ ఉమేష్, స్థానిక బీఆర్‌ఎస్ నేతలు ఉన్నారు.

విచారణను ధైర్యంగా ఎదుర్కోవాలి

ముషీరాబాద్: రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన సంస్థలు చేసే దర్యాప్తులు విచారణలను నేరుగా ఎదుర్కోకుండా కేసీఆర్ కుటుంబం తప్పించుకునే ప్రయత్నాలు చేస్తోందని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ విమర్శించారు. 'ఆలె నరేంద్ర, ఈటల రాజేందర్, రాజయ్యలపై దురుద్దేశ పూర్వకంగా అవినీతి ఆరోపణలు చేసి చర్యలకు దిగిన కేసీఆర్ తన కూతురు కవిత అవినీతిపై రక్షించే ప్రయత్నం చేస్తున్నారని' ఆరోపించారు. 'కొత్తగా ఏర్పడిన రాష్ట్రంలో సీఎం కేసీఆర్ మొదటి నుంచి వ్యవస్థలను అవినీతి మయం చేశారని' మండి పడ్డారు. గడిచిన 9 ఏళ్లలో అధికార పార్టీ ఎన్నికల్లో వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. బీసీ సంఘం నాయకులు నీల వెంకటేష్, సుధాకర్‌ముదిరాజ్, వేముల రామకృష్ణ, రాంబాబు, రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మరిన్ని న్యాయ సంస్కరణలు అవసరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్లు గాలి వినోద్‌కుమార్, రామచంద్రారెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు

కవాడిగూడ: దేశంలో మరిన్ని న్యాయ సంస్కరణలు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉందని ఉస్మానియా యూనివర్సిటీ లా కళాశాల ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం కవాడిగూడ డివిజన్ దోమలగూడ ఏవీ కళాశాల ఆడిటోరియంలో 'భారతదేశంలో ఎన్నికల సంస్కరణలు, సమస్యలు, సవాళ్లు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు కె.వీ.రంగారెడ్డి లా కళాశాల ప్రిన్సిపాల్ సెమినార్ డైరెక్టర్ డాక్టర్ జైపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, జస్టిస్ నారాయణ, మాజీ సమాచార కమీషనర్ ఆర్.దిలీప్‌రెడ్డి, ఏవీ ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామచంద్రారెడ్డి, కేవీ రంగారెడ్డి లా కళాశాల కరస్పాండెంట్ వినోద్‌రెడ్డిలు జ్యోతి ప్రజ్వలన చేసి సెమినార్‌ను ప్రారంభించారు. ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. దేశంలో సంస్కరణలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

- దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు పైబడినా దేశ ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేర్కొన్నారు.
- ప్రస్తుతం ప్రజా ప్రతినిధులు సేవాదృక్పదంతో కాకుండా వ్యాపార దృక్పదంతో ముందుకు రావడం జరుగుతుందని అందుకే నేడు రాజకీయ రంగం వ్యాపార రంగంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.
- దేశ సంపద కొద్దిమంది చేతుల్లోనే బందీగా మారిపోయిందని 75 ఏళ్ల పాలనలో దేశాన్ని 2–3 కుటుంబాలు మాత్రమే పరిపాలించాయన్నారు.
- ప్రపంచంలో చదువుకున్న మేధావులు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికై ప్రజలని పాలిస్తుంటే అందుకు బిన్నంగా మనదేశంలో ప్రజాస్వామ్య విలువలు తమ ప్రజాసేవకు ప్రాధాన్యత ఇవ్వని వారు అసెంబ్లీ, పార్లమెంట్‌కు వెళ్లడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటినీ సమూలంగా చైతన్యంతో తిప్పికొట్టినప్పుడే దేశ ప్రజల మధ్య సమానత్వం, విలువలు పెరుగుతాయన్నారు.
- దేశ ఎన్నికల వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని జస్టిస్ నారాయణ అన్నారు. నేడు ప్రజాస్వామ్య విలువలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఓటును నోటుతో కొనుగోలు చేస్తూ.. ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో రోజు రోజుకు దేశంలో అవినీతి పెరిగిపోతుందన్నారు.
- నేటి యువత విద్యావేత్తలు, మేదావులు దేశంలో జరుగుతున్న అవినీతిని ఎండగట్టి ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు దోహదపడాలని ఏవీ ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాంచంద్రారెడ్డి సూచించారు. సెమినార్ కన్వీనర్ జైపాల్‌రెడ్డి, ప్రొఫెసర్లు, లా కళాశాల విద్యార్థులు హాజరయ్యారు.

విద్యార్థులు పరిశోధన వైపు అడుగులు వేయాలి



జాతీయ సదస్సులో పాల్గొన్న డాక్టర్ వెంకటరమణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశ సమగ్రత, భవిష్యత్తు కోసం విద్యార్థులు పరిశోధనల దిశగా అడుగులు వేయాలని ఏపీటీఐ (సౌథర్న్ రీజన్) వైస్ చైర్మన్ డాక్టర్ వెంకటరమణ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవంతి ఫార్మసీ కళాశాల గుంతపల్లి, అవంతి డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో బయో అధ్యాయన్–2023 పేరిట జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ.. నేడు ఫార్మసీ రంగంలో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. ఏ రంగాన్ని ఎంచుకున్నా.. దానిలో ప్రావిణ్యత సాధిస్తే వారికి మంచి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రపంచంలో జరుగుతున్న ఔషద ఎగుమతుల్లో ఎక్కువ శాతం మన దేశం నుంచే జరుగుతుందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ కవికిషోర్, అవంతి కళాశాలల డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలాజీ, డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీరసోమయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించి అభినందనలు తెలిపారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

అంబర్‌పేట: అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం డివిజన్‌లోని ఎరుకల బస్తీలో చేపట్టిన డ్రైనేజీ పనులను ఆమె పరిశీలించి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని జలమండలి అధికారులకు సూచించారు. భవిష్యత్తులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఆమె జలమండలి అధికారులు, స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు.



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

బీఆర్‌ఎస్‌లోకి చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: దేశవ్యాప్తంగా బీఆర్‌ఎస్‌కు లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే బీజేపీ అధిష్టానం రాజకీయ దురుద్దేశంతో బీఆర్‌ఎస్ నేతలపై ఈడీ, సీబీఐ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తోందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆరోపించారు. ప్రజలే ఆ పార్టీకి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతారన్నారు. శుక్రవారం ముషీరాబాద్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు శ్రీధర్‌గౌడ్, బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు ప్రేమలతారెడ్డి, శ్రీవల్లితో పాటు పలువురు నేతలు ఎమ్మెల్యే ముఠాగోపాల్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. నర్సింగ్ ప్రసాద్, శ్రీధర్, లక్ష్మణ్‌గౌడ్, సాంబశివరావు, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి తదితరులున్నారు.

సుబ్రహ్మణ్యస్వామి, నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: రాంనగర్ సీతారామంజనేయస్వామి దేవాలయంలోని ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్యస్వామి, నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది. శుక్రవారం వేదపండితులు, భక్తుల కోలాహలం నడుమ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలు ప్రారంభం కాగా.. గణపతి హోమం, క్షీరాభిషేకం, మంటపారాధన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆలయ కమిటీ చైర్మన్ రవియాదవ్, ధర్మకర్తలు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, గోవర్ధన్‌యాదవ్, గోవర్ధన్‌రెడ్డి, రజనీ, ఆలయ ప్రధాన అర్చకులు వెంకటరమణచార్యులు, వేణుగోపాలచార్యులు, ప్రతాప్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



కవాడిగూడ: రాందాస్ అగర్వాల్‌జీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. హైదరాబాద్‌లోని ముషీరాబాద్ ఆర్యవైశ్య భవన్ వైశ్య హాస్టల్‌లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో రాందాస్ అగర్వాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాస్‌గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పేదలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. గంజి రాజమౌళి గుప్తా, స్వప్న, కట్ట రవి, శ్రీనివాస్, నర్సింగ్‌రావు, సత్తయ్య, భువన, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్న పత్రాల లీకేజీపై సీబీఐ దర్యాప్తు చేయించాలి



దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు కృష్ణస్వరూప్, శ్యామ్‌కుమార్

కాచిగూడ: గ్రూప్–1 ప్రశ్న పత్రాల లికేజీకి బాధ్యులైన వారిపై రాష్ట్ర గవర్నర్ తగిన చర్యలు తీసుకోవాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) జాతీయ అధ్యక్షుడు కృష్ణ స్వరూప్, నేషనల్ డెమోక్రటిక్ సెక్యూలర్ ఫ్రంట్ (ఎన్‌డీఎస్‌ఎఫ్) మీడియా కన్వీనర్ శ్యామ్‌కుమార్ కోరారు. శుక్రవారం నారాయణగూడలో వారు మాట్లాడుతూ.. ప్రశ్న పత్రాల లికేజీ వెనుక అధికార పార్టీ హస్తం ఉందని ఆరోపించారు. రాష్ట్రంలో మెజారిటీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకుండా అడ్డుకునేందుకు రూ.1 కోటి నుంచి రూ. 5 కోట్ల వరకు లంచాలు తీసుకుని పరీక్ష ప్రశ్న పత్రాలను టీఎస్‌పీఎస్‌సీ కమిటీ ఆధ్వర్యంలో లీక్ చేశారని ఆరోపించారు.

- గత 8 ఏళ్లుగా ఈ అక్రమ దందా నడుస్తోందన్నారు. తెలంగాణ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న టీఎస్‌పీఎస్‌సీ మొత్తం పాలకవర్గం కమిటీని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేయాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సోమయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (40) పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుడి ఒంటిపైన బ్లూకలర్ షర్టు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ విజయోత్సవ వేడుకలు



బీజేపీ నగర కార్యాలయం వద్ద స్వీట్లు పంచుతున్న బీజేపీ నేతలు

కాచిగూడ: టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి గెలుపొందడంతో బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయం వద్ద ఆపార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించుకుని స్వీట్లు పంపిణీ చేసి బాణసంచా కాల్చారు. ఈ సంర్భంగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతంరావు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు బీజేపీని కోరుకుంటున్నారని, విద్యావంతులైన టీచర్లు, ప్రజలు మోదీవైపు ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏవీఎన్ రెడ్డి గెలవడంపై విపక్షాలు ఆశ్చర్యానికి గురవుతున్నాయని ఆ పార్టీలకు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పనున్నారన్నారు. బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పాలనకు త్వరలోనే తెలంగాణ ప్రజలు చరమగీతం పాడబోతున్నారన్నారు. దేశ ప్రజలందరూ ఎమ్మెల్సీ కవిత లిక్కర్ స్కాంపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్నారు. బీజేపీ నేతలు వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్‌యాదవ్, పద్మావెంకట్‌రెడ్డి, వనం రమేష్, కేశబోయిన శ్రీధర్, అజయ్‌కుమార్, ఎం.బీ.కిషోర్, ఎస్ఎస్ రాము, కృష్ణంరాజు, బండారు సంతోష్, భీమ్‌రాజ్, సుభాష్ పటేల్ పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు ట్రాఫిక్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్‌రాజు

కాచిగూడ: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. శుక్రవారం కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద రైల్వే ఉద్యోగులకు ట్రాఫిక్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై పీపీటీ ద్వారా అవగాహన కల్పించారు. క్రమశిక్షణ, ఐక్యత, సమయాన్ని వృథా చేయకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాన్ని నడిపితే జరిమానాతో పాటు లైసెన్స్‌లను కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. పద్మావతి, క్రిష్ణ, చిరంజీవి, ముత్తుస్వామి, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'పై కార్పొరేటర్ ఆరా

చిక్కడపల్లి: కంటివెలుగు వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్‌లోని వి.వి.గిరినగర్ కమ్యూనిటీ హాల్ వద్ద నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమంలో ప్రజలకు అందుతున్న వైద్య సదుపాయాలను ఆమె పర్యవేక్షించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. కంటి వెలుగు ద్వారా ప్రజలకు అందుతున్న ఉచిత కంటి వైద్యసేవలు మరింత మందికి అందేలా కృషి చేస్తామన్నారు. కంటి ఆపరేషన్‌కోసం ఉచితంగా ఎల్‌వీ ప్రసాద్, సరోజినీదేవి కంటి ఆసుప్రత్రులకు పంపిస్తామన్నారు. బీజేపీ నగర యువనాయకులు వినయ్‌కుమార్, సీనియర్ నాయకులు జాషువా, మహిళా నాయకురాలు విజయలక్ష్మి, కృపాసిస్టర్, ఆశా వర్కర్లు దుర్గ, అంగన్‌వాడి టీచర్ ప్రమీల పాల్గొన్నారు.

'ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ దీక్ష చేస్తాననడం సిగ్గు చేటు'

కాచిగూడ: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్‌లో ప్రశ్న పత్రాల లీకేజీలపై బీఎస్‌పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ దీక్ష చేస్తానని చెప్పడం సిగ్గుచేటని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ విమర్శించారు. టీఎస్‌పీఎస్‌సీలో జరిగిన తప్పులను సరిచేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం, నిపుణులు ఉన్నారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ 2011 నుంచి బీఎస్పీలో చేరేవరకు వేలాది మందిని తన ఇష్టానుసారంగా గురుకులాల్లో భర్తీ చేశారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, జనరల్ గురుకులాల్లో రెగ్యులర్ ఉద్యోగాల భర్తీ కోసం జరిగిన రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో తన కులానికి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి ఇతర కులాల నిరుద్యోగులకు తీరని అన్యాయం చేశారని ఆయన మండిపడ్డారు. ఆయన నేర్పిన పాఠాన్ని నేడు ఓ మహిళా టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీలో భాగస్వామిగా మారి ఎంతో మంది జీవితాలను నాశనం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవీణ్ కుమార్ గతంలో చేసిన అన్ని రకాల ఉద్యోగాల భర్తీపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్‌సీ ద్వారా జరిపిన అన్ని రకాల ఉద్యోగ అర్హత పరీక్షలను రద్దు చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

జనాభాకు అనుగుణంగా అభివృద్ధి పనులు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైపులైన్ పనులను ఆధునీకరించేందుకు వాటర్ వర్క్స్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ అధికారులను ఆదేశించారు. కవాడిగూడ డివిజన్ కుమ్మరి బస్తీ, మజీద్‌గల్లీ, ఆర్యసమాజ్ గల్లీ, బాలకృష్ణ సమాజ్‌లో నిత్యం డ్రైనేజీలు పొంగిపొర్లుతోందని స్థానికుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ రచనశ్రీ జలమండలి డీజీఎం కార్తీక్‌రెడ్డి, ఏఈ ప్రసాద్‌లతో కలిసి ఆయా బస్తీలలో పర్యటించారు. డివిజన్ పరిధిలోని డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ పనులను పూర్తిగా ఆధునికరించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు వెంకటేష్, పరిమళ్‌కుమార్, ఎంసీ మహేందర్‌బాబు, ప్రభాకర్, కేశవరాజు, కుమార్‌గౌడ్, రమేష్, అనిల్ తదితరులున్నారు.

ఎన్నారై పాలసీ అమలు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఇతర దేశాల్లో స్థిరపడి మనదేశ అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తున్న వారి సంక్షేమం కోసం ఎన్నారై పాలసీ అమలు చేయాలని బీసీ రాజ్యాధికార సమితి కన్వీనర్ దాసు సురేష్ అన్నారు. ఇటీవల గల్ఫ్‌లో పర్యటించి తిరిగొచ్చిన అనంతరం శుక్రవారం రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో కమిటీ సభ్యులు చాపర్తి కుమార్ గాడ్గే అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గల్ఫ్‌లో భారతీయులు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడి భారత అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రవాస భారతీయులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఆయా దేశాల కాన్సులేట్ ఆఫీసుల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయాలని కోరారు.

'సమస్యలు పరిష్కరించాలని కోరితే వెళ్లగొట్టడం సరికాదు'

కాచిగూడ: అనాథల సమస్యలు పరిష్కరించాలని వారి ప్రతినిధిగా సీసీఎల్ఏ కార్యాలయానికి వెళ్లిన తనను కమీషనర్ వెళ్లగొట్టారని తెలంగాణ రాష్ట్ర అనాథ హక్కుల సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, అనాథ హక్కుల ఐక్యవేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్క వెంకటయ్య ఆరోపించారు. పబ్లిక్ సర్వెంట్ అనే విషయం కమీషనర్ మరిచి దురుసుగా ప్రవర్తించారన్నారు. కమీషనర్ అనాథలకు క్షమాపణ చెప్పాలని, లేదంటే శాంతియుతంగా నిరసన దీక్ష చేపడతామన్నారు.